# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

telugu prabha.net

-TeluguPrabha

@TeluguPrabhaofficial

TS వైబ్రెంట్ ఎడిషన్ 1 pm


మంగళవారం 8-8-2023


## పుదుచ్చేరిలో రాష్ట్రపతి, గవర్నర్



**పుదుచ్చేరి,ఆగస్ట్8 (తెలుగుప్రభ):**

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా కూడా ఉన్న తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పుదుచ్చేరిలోని తిరుకంచి గంగా వరాహ నాదీశ్వర్ ఆలయాన్ని సందర్శించారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా రాష్ట్రపతి ఆలయాన్ని సందర్శించారు.



# చేనేత.. వెత తీరేలా!

## సంక్షేమాలతో సర్కారు ఆసరా

**హైదరాబాద్, ఆగస్ట్ 8(తెలుగుప్రభ):**

'చేతి వృత్తుల చేతులిరిగిపాయే నా పల్లెల్లోన.. గ్రామ స్వరాజ్యం గంగలోనబాయే ఈ దేశం లోన' అంటూ కన్నీటి పాటలు పాడుకున్న దశ నుంచి ప్రజల మానాన్ని, అభిమానాన్ని కాపాడుతున్న చేనేత వృత్తి కళాకారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్త కార్యక్రమాలు చేపడుతోంది.

వ్యవసాయ రంగం తర్వాత ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న చేనేత రంగానికీ సీఎం కేసీఆర్ తగు ప్రాధాన్యతనిచ్చారు. రైతుబంధు ద్వారా రైతును కాపాడుకున్నట్లే వారి తర్వాత అధిక సంఖ్యలో ఉన్న నేతన్నలను బతికించుకునేందుకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు.

### అన్ని వృత్తులకూ తగిన పథకాలు

రైతులు, చేనేతలు బాగుంటేనే ఎవరైనా బతికేది.. బట్టకట్టేది అన్న నిజాన్ని గుర్తించిన కేసీఆర్ ప్రథమ ప్రాధాన్యతగా 'అబ్‌కీ బార్ కిసాన్ సర్కార్' నినాదంతో దేశ రాజకీయ యవనికపై జైత్రయాత్రకు బయల్దేరారు. దశలవారీగా అన్ని వృత్తులకూ తగిన పథకాలు, ప్రాధాన్యతలు ఇస్తున్నారు.కేంద్రంలో రానున్నది సంకీర్ణ సర్కారే అని ధీమాగా చెబుతున్నారంటే అందుకు కారణం సమస్త వృత్తుల వాళ్లకు బీఆర్ఎస్‌పై ఉన్న నమ్మకమే! మహారాష్ట్రలోనూ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందన్న ధీమానే !

### మరో పథకానికి శ్రీకారం

ప్రతిపక్షాల ఊహకు కూడా అందని విధంగా వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం మరో పథకానికి శ్రీకారం చుట్టింది. వృత్తిని నమ్ముకున్న ప్రతి వ్యక్తికీ, మగ్గమున్న ప్రతి ఇంటికీ చేనేత మిత్ర పథకం కింద మగ్గానికి నెలకు రూ.3వేలు ఇవ్వనున్నట్లు చేనేత, జౌళి శాఖల మంత్రి కేటీఆర్ ప్రకటించారు. వ్యవసాయం తర్వాత ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న చేనేత రంగంపై గత ప్రభుత్వాలన్నింటిదీ చిన్నచూపే. మగ్గం గుంటల్లో గంటల తరబడి పనులు చేసి, నడుములు వంగి.. దేహం కుంగి.. చేవ చచ్చి.. శక్తి లేక యాభయ్యేళ్లు వచ్చేప్పటికే జీవచ్ఛవాలుగా మారుతున్న నేత కార్మికులను పట్టించుకున్న వారు లేరు. అగ్గిపెట్టెల్లోనే పట్టే పట్టుచీరలను నేసిన అద్భుత కళ వారి సొంతమైనా.. ఉన్న రాష్ట్రంలో ఉపాధి లేక సూరత్, భివాండీ, ముంబై తదితర ప్రాంతాలకు వలస వెళ్లే కుటుంబాల్లో బీఆర్ఎస్ వచ్చాక మార్పు వచ్చింది. ఇప్పుడు వారికి మరిన్ని ప్రయోజనాలు కల్పించే కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనుంది. ఇప్పటికే అమలు చేస్తున్న పథకాల్లో లోటుపాట్లుంటే సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

### చేనేత కార్మికుల కోసం

చేనేత వస్త్రాలపైనా 5 శాతం జీఎస్టీ విధించిన బీజేపీ తీరును ఎండగడుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ రంగ కార్మికుల కోసం వివిధ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోంది. నరాలు తెగిపోతున్నా నూలు దారాల అల్లికలతోనే నాగరికతను సృష్టిస్తున్న వారి కోసం ప్రభుత్వం ప్రకటించిన తాజా ప్రయోజనాలు.

- చేనేత మిత్ర పథకం కింద ప్రతి మగ్గానికీ వచ్చే నెల నుంచి రూ. 3వేల పంపిణీ.
- 75 ఏళ్ల వయసు వరకు చేనేత కార్మికులకు బీమా సదుపాయం.
- రూ.25వేల పరిమితితో హెల్త్‌కార్డులు.
- గుంటమగ్గాల స్థానే 'తెలంగాణ చేనేత మగ్గం' పథకం పేరిట రూ.40.50 కోట్లతో ఫ్రేమ్‌లూమ్స్ మగ్గాలు.
- చేనేత, అనుబంధ కార్మికులకు ఐడీ కార్డులు.
- చేనేత కార్మికుల అంత్యక్రియలకు ఇస్తున్న మొత్తం రూ.25 వేలకు పెంపు.
- డీసీసీబీల సహకారంతో పెట్టుబడి సహాయం.
- మగ్గం షెడ్ ఏర్పాటుకు గృహలక్ష్మి కింద సహాయం.

## లోక్‌సభ వాయిదాల పర్వం..

# అవిశ్వాస తీర్మానంపై చర్చ..



**న్యూఢిల్లీ, ఆగస్ట్8 (తెలుగుప్రభ)**

బీజేపీ నేత నిషికాంత్ దూబే సోమవారం లోక్‌సభలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేశారు. అయితే ఆ వ్యాఖ్యలను వాస్తవానికి ఆ ప్రసంగం నుంచి తొలగించారు. కానీ ఆ వ్యాఖ్యలకు చెందిన రికార్డును మాత్రం లోక్‌సభ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ అంశంపై ఇవాళ లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ లేవనెత్తింది. ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరీ ప్రశ్నించారు. ప్రసంగం నుంచి తొలగించిన వ్యాఖ్యలను మళ్లీ ఎలా రీ రికార్డు చేశారని ఆయన నిలదీశారు. సభా కార్యక్రమాలను అడ్డుకున్నారు. విపక్షాల ఆందోళన నేపథ్యంలో సభను 12 గంటల వరకు వాయిదా వేశారు.

### అవిశ్వాస తీర్మానంపై

**లోక్‌సభలో అవిశ్వాస తీర్మానంపై చర్చ మొదలైంది. విపక్ష ఇండియా కూటమి తరపున కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ ఇచ్చిన అవిశ్వాస తీర్మానంపై రాహుల్ గాంధీ చర్చను ప్రారంభించారు. మణిపూర్ హింసపై పాలక, విపక్షాల మధ్య మాటల యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో... అవిశ్వాస తీర్మానంపై వాడీవేడిగా చర్చలు జరిగే అవకాశం ఉంది. ఈ నెల 10న ప్రధాని మోడీ అవిశ్వాస తీర్మానంపై మాట్లాడనున్నారు.**

సోమవారం దూబే మాట్లాడుతూ.. వెబ్‌పోర్టల్ న్యూస్‌క్లిక్‌కు 38 కోట్ల ఫండింగ్ వచ్చిందని, ఆ డబ్బును ఇండియాకు వ్యతిరేకంగా ఖర్చు చేయాలన్న ఉద్దేశంతో పంపించారని, దీనికి సంబంధించిన రిపోర్టు న్యూయార్క్‌టైమ్స్ పత్రికలో వచ్చినట్లు దూబే ఆరోపించారు. న్యూస్‌క్లిక్‌కు చెందిన వ్యక్తి తుక్డే తుక్డే గ్యాంగ్‌లో సభ్యుడని ఆయన విమర్శించారు. దీని ద్వారా లబ్ధిపొందిన వారిపై ప్రభుత్వం దర్యాప్తు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. 2005 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పార్టీకి చైనా ప్రభుత్వం డబ్బు ఇచ్చిందని, కాంగ్రెస్ దేశాన్ని విభజించాలని చూస్తున్నట్లు ఆయన ఆరోపించారు. అయితే రికార్డుల నుంచి దూబే ప్రసంగంలో ఉన్న కొన్ని అంశాలను తొలగిస్తున్నట్లు తొలుత లోక్‌సభ సెక్రటేరియట్ పేర్కొన్నది. కానీ మళ్లీ లోక్‌సభ సైట్‌లో ఆ తొలగించిన ప్రసంగానికి చెందిన భాగాన్ని అప్‌లోడ్ చేశారు. అప్‌లోడ్ చేసిన ప్రసంగాన్ని తప్పుపడుతూ మంగళవారం లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీ ఆందోళన చేపట్టింది.

# నిజామాబాద్‌లో ఐటీ టవర్

### – రేపు ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్




హైదరాబాద్, ఆగస్ట్8 (తెలుగుప్రభ):

నిజామాబాద్‌లో ఐటీ టవర్‌ను బుధవారం మంత్రి కె.తారకరామారావు ప్రారంభించనున్నారు. ట్విట్టర్ వేదికగా స్వయంగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. టూ టయర్ పట్టణాలు, నగరాల్లోనూ ఐటీ సెక్టార్‌ను అభివద్ధి పరుస్తామన్న హామీ కనుగుణంగా నిజామాబాద్‌లో ఐట్ టవర్‌ను నిర్మించారు. యువత నైపుణ్యాలు పెంపొందించేందుకు, నూతన ఆవిష్కరణలు చేసేందుకు ఉపయోగపడేలా టీహబ్, టాస్క్ సెంటర్‌లు కూడా ఇందులో ఉంటాయన్నారు.

యువత కలలు నెరవేరేలా తగిన సాధనసంపత్తిని అందించడం కూడా తెలంగాణ ప్రగతి రథం వేగంగా ముందుకు వెళ్లడంలో కీలకాంశమని అభివర్ణించారు. ఐటీ టవర్‌తోపాటు కొత్తగా నిర్మించిన న్యాక్, మునిసిపల్ కార్యాలయం, మినీట్యాంక్ బండ్ వైకుంఠ ధామాలను సైతం మంత్రి ప్రారంభించనున్నారు. అనంతరం పాలిటెక్నిక్ కాలేజ్ గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

## వేములవాడలో పర్యటన

**సిరిసిల్ల, ఆగస్ట్8 (తెలుగుప్రభ):**




వేములవాడ నియోజకవర్గంలో పర్యటిస్తున్న మునిసిపల్ మంత్రి కె. తారకరామారావు

నందికమాన్ జంక్షన్‌తో పాటు పలు పలు పనులకు ప్రారంభోత్సవం చేశారు. మధ్యాహ్నం మూడు గంటలకు బీసీ బంధు పథకం కింద 600 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయనున్నారు.

## నకిలీ ఐఏఎస్ అరెస్ట్

**శ్రీనగర్, ఆగస్ట్ 8 (తెలుగుప్రభ) :**

ఆయనో పోలీసు. సస్పెండయ్యారు. ఏంగా ఐఏఎస్ అవతారమెత్తారు. మన్మోహన్ గంజూ, ఆయన భార్య ఆయుష్‌కౌల్ తాము ఐఏఎస్, ఐపీఎస్ అధికారులమని చెప్పుకుంటూ ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను నమ్మించారు. వారి వద్ద నుంచి లక్షల రూపాయలు వసూలు చేశారు. శ్రీనగర్ పోలీసులకు పలు ఫిర్యాదులు అందడంతో వారిని అరెస్టు చేశారు. వారివద్ద నుంచి నకిలీ ఉద్యోగ నియామక పత్రాలు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.




## ఉత్తరాఖండ్‌లో వర్ష బీభత్సం

**డెహ్రాడూన్, ఆగస్ట్ 4 (తెలుగుప్రభ)**

ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఎడతెగని వర్షాలు బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి. ముందుకు కదలలేక వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోతున్నాయి. కొడియాల వద్ద దాదాపు 1500 వాహనాలు ఆగిపోవడంతో 20 వేల మంది అక్కడే చిక్కుకుపోయారు. దాదాపు 40 కి.మీ.ల పొడవునా స్థానికులతో పాటు రిషికేష్ యాత్రికులు గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. ఎక్కడికక్కడ కొండచరియలు విరిగి పడుతుండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని బిక్కుబిక్కుమంటున్నారు. వీరిలో తెలంగాణ వారితో పాటు ఆంధ్రప్రదేశ్, బెంగళూర్‌లకు చెందిన వారు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. వీరంతా తిరుగుప్రయాణంలో ఉండగా ఈపరిస్థితి తలెత్తింది. త్వరగా సహాయక చర్యలు చేపట్టాల్సిందిగా యాత్రికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## మరో ఐఐటీ విద్యార్థి ఆత్మహత్య




**హైదరాబాద్, ఆగస్ట్8 (తెలుగుప్రభ):**

హైదరాబాద్ ఐఐటీలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని మమైత (20) ఆత్మహత్య చేసుకుంది. నగర శివార్లలో సంగారెడ్డి జిల్లా కందిలో ఉన్న క్యాంపస్‌లో ఇప్పటికే ఏడుగురు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడవంతో పాటు తాజా దుర్ఘటన కలకలం రేపుతోంది. హాస్టల్ గదిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకోవడంతో మతి చెందింది. ఒడిశా రాష్ట్రానికి చెందిన ఆమె గతనెలలో క్యాంపస్‌కు వచ్చింది. ఒరియా భాషలో రాసి ఉన్న లేఖను స్వాధీనం చేసుకున్న పోలీసులు విషయాన్ని ఆమె తల్లిదండ్రులకు తెలిపారు. ఆత్మహత్యకు కారణాలేమిటో తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నారు.

## 'కరాటే' వివాదాస్పద వ్యాఖ్యలు

**హైదరాబాద్, ఆగస్ట్8 (తెలుగుప్రభ):**



సినీనటి, బిగ్‌బాస్ ఫేమ్ కరాటే కళ్యాణి గద్దర్ మరణం సందర్భంగా వివాదాస్పద పోస్టులు పెట్టారు. 'ఎర్రపాట మూగబోయింది.. 'అంటూ బాలు, విశ్వనాథ్‌ల మరణాల సందర్భంగా ఎర్రబ్యాచ్ ఏమందో మర్చిపోలేదు అని పేర్కొంటూ ఫేస్‌బుక్‌లో ఎర్రబ్యాచ్ అంటూ హేళనగా వివాదానికి కారణమయ్యారు. దీంతో గద్దర్ అభిమానులు, ప్రజాసంఘాల నాయకులు ఫైర్ అవుతున్నారు.

## జహీర్‌కు నివాళి



**హైదరాబాద్, ఆగస్ట్8 (తెలుగుప్రభ)**

నిన్న రాత్రి హఠాన్మరణం చెందిన సియాసత్ ఉర్దూ దినపత్రిక మేనేజింగ్ ఎడిటర్ జహీర్ అలీ ఖాన్ అంత్యక్రియలు ఇవాళ తెల్లవారుజామున నాంపల్లిలో జరిగాయి. అంతిమయాత్రలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విరాహత్ అలీ, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్, ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎం.ఏ.మాజీద్, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ హెచ్.యు.జె కార్యదర్శి షౌకత్ హమీద్, మాజీ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, తెలంగాణ జనసమితి పార్టీ, టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం, వీక్షణం ఎడిటర్ ఎన్. వేణుగోపాల్, జనం సాక్షి సంపాదకులు రెహ్మాన్ తదితరులు హాజరై అలీ ఖాన్ కు నివాళి అర్పించారు.